సాక్షి
నంద్యాల
బుధవారం ၊ 10 ၊ సెప్టెంబర్ ၊ 2025



ప్రయాణికులకు విజ్ఞప్తి

ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు అనంతపురం జిల్లా పర్యటన ప్రయాణికులకు శాపంగా మారింది. ఉమ్మడి జిల్లా నుంచి 280 బస్సులు సభకు తరలించారు.


8లో▸



ఉన్నది ఒకటే జిందగీ!

ఉమ్మడి కర్నూలు జిల్లాలో ప్రతి నెలా 30 నుంచి 40 మంది వరకు ఆత్మహత్యకు పాల్పడి జీవితాన్ని ముగిస్తున్నారు. కారణాలు ఏవైనా ఆత్మహత్యే శరణ్యమంటున్నారు.

8లో▸



టీబీ డ్యాం సమాచారం

పూర్తి మట్టం	: 1,633 అడుగులు
ప్రస్తుతం	: 1,626.06
టీఎంసీల సామర్థ్యం	: 105.788
ప్రస్తుతం	: 80.003
ఇన్‌ఫ్లో (క్యూసెక్కులు)	: 29,736
ఔట్‌ఫ్లో (క్యూసెక్కులు)	: 29,224

న్యూస్‌రీల్

నేటి నుంచి బేతంచెర్లలో ఆగనున్న 'కొండవీడు'



బేతంచెర్ల: మచిలీపట్నం – యశ్వంతపూర్ మధ్య నడిచే కొండవీడు ఎక్స్‌ప్రెస్ బుధవారం నుంచి బేతంచెర్ల రైల్వే స్టేషన్‌లో ఆగనుంది. కరోనా సమయంలో తీసేసిన స్టాపేజ్‌ను పునరుద్ధరించారు. మచిలీపట్నం నుంచి యశ్వంత్‌పూర్‌కు వెళ్లే రైలు (17211) బేతంచెర్లలో బుధవారం రాత్రి 12.34 గంటలకు ఆగుతుంది. తిరుగు ప్రయాణంలో అదే రైలు (యశ్వంత్‌పూర్ – మచిలీపట్నం 17212) 11వ తేదీ నుంచి రాత్రి 9.19 గంటలకు ఆగుతుంది. బేతంచెర్లలో స్టాపేజ్ పునరుద్ధరించంతో విజయవాడ – బెంగళూరు మధ్య ప్రయాణించే ప్రయాణికులు సౌకర్యవంతంగా ఉండనుంది. ఇందుకు కృషి చేసిన ఎంపీ బైరెడ్డి శబరికి బేతంచెర్ల ప్రజలు, ప్రజా సంఘాలు వ్యాపార, స్వచ్ఛంద సంఘాల ప్రతినిధులు కృతజ్ఞతలు తెలిపారు.

శ్రీశైలం నుంచి కొనసాగుతున్న నీటి విడుదల

శ్రీశైలంప్రాజెక్ట్: శ్రీశైలం జలాశయం నుంచి దిగువ ప్రాజెక్టులకు నీటి విడుదల కొనసాగుతూనే ఉంది. మంగళవారం సాయంత్రం సమయానికి జలాశయంలో 208.2841 టీఎంసీల నీరు నిల్వ ఉంది. డ్యాం నీటిమట్టం 883.70 అడుగులకు చేరుకుంది. సోమవారం నుంచి మంగళవారం వరకు జలాశయానికి 1,30,011 క్యూసెక్కుల వరదనీరు వచ్చి చేరింది. రేడియల్ క్రస్ట్‌గేట్లను మూసివేసినప్పటికీ జలాశయం నుంచి దిగువ ప్రాంతాలకు 1,61,680 క్యూసెక్కుల నీటిని విడుదల చేశారు. స్పిల్‌వే ద్వారా 55,355 క్యూసెక్కులు, విద్యుత్ ఉత్పత్తి అనంతరం 69,901 క్యూసెక్కుల నీటిని నాగార్జునసాగర్‌కు విడుదల చేశారు. బ్యాక్ వాటర్ నుంచి పోతిరెడ్డిపాడు హెడ్‌రెగ్యులేటరీ ద్వారా 32,000 క్యూసెక్కులు, హంద్రీనీవా సుజలస్రవంతికి 2,824 క్యూసెక్కులు, కల్వకుర్తి ఎత్తిపోతలకు 1,600 క్యూసెక్కుల నీటిని వదిలారు.

తనయుడి బ్రహ్మోత్సవాలకు తండ్రి తరఫున పట్టువస్త్రాలు



పట్టువస్త్రాలను సమర్పిస్తున్న మహానంది ఈఓ, పండితులు

మహానంది: కాణిపాకం వరసిద్ధి వినాయకుడి బ్రహ్మోత్సవాల నేపథ్యంలో మహానంది దేవస్థానం తరఫున మంగళవారం పట్టువస్త్రాలను సమర్పించారు. ఈ మేరకు ఆలయ ఈఓ నల్లకాలువ శ్రీనివాసరెడ్డి, ప్రధాన అర్చకులు, వేదపండితులు కాణిపాకం క్షేత్రానికి చేరుకుని సంప్రదాయబద్ధంగా పట్టువస్త్రాలు సమర్పించారు. గత కొన్నేళ్లుగా కాణిపాకం వరసిద్ధి వినాయకస్వామి బ్రహ్మోత్సవాల నేపథ్యంలో పట్టు వస్త్రాలను అందించడం ఆనవాయితీగా వస్తోంది. పట్టువస్త్రాలను సమర్పించిన మహానంది ఈఓ, పండితులు, అర్చకులు, సిబ్బందిని కాణిపాకం ఆలయ అధికారులు, పండితులు సన్మానించి స్వామి, అమ్మవారి ప్రసాదాలు అందించారు.

ఎయిడ్స్ నివారణకు కృషి చేయాలి



మారథాన్ ప్రారంభిస్తున్న అధికారులు

గోస్పాడు: ఎయిడ్స్ నివారణకు ప్రతి ఒక్కరూ కృషి చేయాలని డీఎంహెచ్ఓ డాక్టర్ వెంకటరమణ అన్నారు. ఏపీఎస్ఏసీఎస్ (ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర ఎయిడ్స్ కంట్రోల్ సొసైటీ) తరఫున, జిల్లా కలెక్టర్ ఆదేశాల మేరకు జిల్లా వైద్య ఆరోగ్య శాఖ జిల్లా ఎయిడ్స్ కంట్రోల్ అధికారి డాక్టర్ శారదాబాయి ఆధ్వర్యంలో మంగళవారం అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా పోలీసు, విద్యాశాఖ, డిస్ట్రిక్ట్ స్పోర్ట్స్ అథారిటీ, 108, ఎన్‌జీఓస్ సహకారంతో ఎయిడ్స్ నివారణ అవగాహన కార్యక్రమంలో భాగంగా యూత్ ఫెస్ట్ 2025 మరథాన్ 5 కి.మీ రెడ్ రన్ కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. ఎయిడ్స్ పట్ల యువత అప్రమత్తంగా ఉండాలన్నారు. సమాజంలో యువత భాగస్వామి అయి ప్రతి ఒక్కరిని చైతన్యవంతులుగా తీర్చిదిద్దాల్సిన అవసరం ఎంతైనా ఉందన్నారు. రెడ్‌రన్‌లో పురుషుల విభాగంలో విజయరాజు మొదటి బహుమతి సాధించగా సురేష్‌నాయుడు రెండో బహుమతి, మహిళల విభాగంలో అనూష మొదటి బహుమతి, ప్రసన్న రెండో బహుమతి, ట్రాన్స్‌జెండర్‌లో శ్రీలేఖ మొదటి బహుమతి, వినీత్‌గౌడ రెండో బహుమతి సాధించగా బహుమతులు అందజేశారు.

ఎరువుల సరఫరాలో ఘోర వైఫల్యం

రైతులకు రెండు నెలలుగా యూరియా దొరకని పరిస్థితి నెలకొన్నా ముఖ్యమంత్రి చంద్రబాబు పుష్కలంగా యూరియా లభిస్తుందని అబద్ధాలు చెప్పడం దారుణం. యూరియా సులభంగా దొరికితే రైతులు పనులను వదిలేసి క్యూలైన్లలో రోజుల తరబడి ఎందుకు నిలబడతారు. యూరియా కొరతతో రైతుల అవస్థల గురించి టీడీపీ అనుకూల మీడియాలోనే కథనాలు వస్తున్నా వారికి ఎందుకు కనిపించవు. మాజీ ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డికి మించి సంక్షేమ పథకాలు అందిస్తామని ఎన్నికల ముందు బాబు ప్రజలను నమ్మించారు. కనీసం సూపర్ సిక్స్‌లో ఒక్క హామీని కూడా పూర్తిగా అమలు చేసిన దాఖలాలు లేవు. గత ప్రభుత్వంలో రైతుల పంటలకు గిట్టుబాటు ధర లేకుంటే ప్రభుత్వమే కొనుగోలు చేసి రైతులను ఆదుకుంది. కూటమి ప్రభుత్వం మాత్రం గిట్టుబాటు ధర కల్పిస్తుందని ప్రచారం చేసుకోవడం మినహా రైతులకు ఏమి చేయలేదు. ఎరువుల సరఫరాలో ఘోరంగా వైఫల్యం చెందింది. అధికారులు నిష్పక్షపాతంగా వ్యవహరించి రైతులకు అవసరమైన మేర పంపిణీ చేయాలి.

– కాటసాని రాంభూపాల్‌రెడ్డి, వైఎస్సార్‌సీపీ జిల్లా అధ్యక్షులు

అన్నదాత ఆత్మహత్యలు పట్టవా

పంటలకు గిట్టుబాటు ధరలు లేక రైతులు అప్పుల పాలై ఆత్మహత్యలకు పాల్పడుతున్నారు. వైఎస్సార్‌సీపీ ప్రభుత్వ హయాంలో పొగాకు క్వింటం రూ.14 వేలు ఉండేది. ప్రస్తుతం కూటమి ప్రభుత్వంలో రూ.2 వేలు రావడం లేదు. వరి, కంది, కంది, పెసర ఇలా ఏ పంటకు కూడా ధర లేక నష్టపోతున్నారు. ఇటీవల కురిసిన వర్షానికి పంటలు దెబ్బతిన్నా ఆదుకోవడంలో ప్రభుత్వం విఫలమైంది. రైతుల సంక్షేమానికి ఈ ప్రభుత్వం ఏమి చేయడం లేదు. యూరియా కేవలం ఒకటి, రెండు బస్తాలిస్తే ఎలా వ్యవసాయం చేస్తారు. రైతు సమస్యలను పరిష్కరించడంలో కాలయాపన చేస్తే సహించేది లేదు. సకాలంలో ఎరువులు సరఫరా చేయడంతో పాటు గిట్టుబాటు ధర కల్పించాలి. లేని పక్షంలో వైఎస్సార్‌సీపీ ఆధ్వర్యంలో ఆందోళనలు ఉధృతం చేస్తాం.

– శిల్పా చక్రపాణిరెడ్డి, శ్రీశైలం మాజీ ఎమ్మెల్యే

రైతు వ్యతిరేకి చంద్రబాబు

వ్యవసాయం దండగా అనే నినాదంతో సీఎం చంద్రబాబు ముందుకెళ్తున్నారు. ఆయన ఎప్పటికైనా రైతు వ్యతిరేకి. రైతు సంక్షేమాన్ని పట్టించుకోరు. కూటమి అధికారం చేపట్టినప్పటి నుంచి రైతులకు కష్టాలు మొదలయ్యాయి. యూరియా సంక్షోభం గతంలో ఎప్పుడూ లేదు. అరొకొరగా వచ్చిన యూరియాను టీడీపీ నాయకుల కనుసన్నల్లోనే బ్లాక్‌మార్కెట్‌కు తరలించి అధిక ధరలకు రైతులకు అంటగడుతున్నారు. చంద్రబాబు ఒక వైపు యూరియా కొరత లేదని చెబుతున్నా ఆయన పత్రికల్లోనే యూరియా కొరతపై కథనాలు వస్తున్నాయి. అన్నదాత పోరు కార్యక్రమానికి వచ్చే వారికి కూటమి ప్రభుత్వం అడ్డంకులు సృష్టించి అడ్డుకునే ప్రయత్నం చేయడం ఎంత సమంజసం. రైతులకు యూరియా, గిట్టుబాటు ధర కల్పిస్తే రైతులు రోడ్డెకాల్సిన అవసరం ఉండదు. గతంలో ఆర్‌బీకేల వద్ద రైతులకు సక్రమంగా ఎరువులు అందేవి. ఇప్పుడు టీడీపీ నాయకుడు చెబితేనే యూరియా బస్తా ఇస్తున్నారు.

– శిల్పా రవి చంద్రకిశోర్‌రెడ్డి, మాజీ ఎమ్మెల్యే నంద్యాల

జిల్లాలో ఎక్కడ చూసినా ఎరువుల కోసం బారులుదీరిన రైతులు.. గిట్టు బాటు ధర లేక ఉల్లి, టమాట దిగుబడులు పారబోస్తున్న దృశ్యాలు.. వర్షాలకు దెబ్బతిన్న పంటలకు అందని ఇన్‌పుట్ సబ్సిడీ.. కూటమి ప్రభుత్వం వ్యవసాయాన్ని పట్టించుకోకపోవడంతో రైతులు కష్టాల్లో కొట్టుమిట్టాడుతున్నారు. సర్కారు కళ్లు తెరిపించి రైతులను ఆదుకునేలా 'అన్నదాత పోరు'పేరుతో వైఎస్సార్‌సీపీ చేపట్టిన నిరసన సెగ కూటమి సర్కారుకు తాకింది. నంద్యాల, డోన్, ఆత్మకూరులో నిర్వహించిన ఆందోళనల్లో రైతన్నలు కదం తొక్కారు. పొలం విడిచి.. పిడికిలి బిగించి.. పోరుబాట పట్టి గర్జించారు. పోలీసుల ఆంక్షలను దాటుకుని రైతులు ఆందోళనలో పాల్గొన్నారు. రైతు సంక్షేమాన్ని విస్మరించిన కూటమి నేతల తీరును తూర్పారబట్టారు. యూరియా కొరతతో రైతులు రోడ్డెక్కుతుంటే అసలు సమస్యే లేదంటూ చెబుతున్న సీఎం చంద్రబాబుపై ఆగ్రహం వ్యక్తం చేశారు.

– బొమ్మలసత్రం/డోన్/ఆత్మకూరు



నంద్యాల.. అన్నదాత పోరుకు కదిలి వచ్చిన రైతులు



ఆత్మకూరు.. బైక్ ర్యాలీలో శిల్పా చక్రపాణి, దారా సుధీర్



నంద్యాల.. ర్యాలీలో పాల్గొన్న వైఎస్సార్‌సీపీ జిల్లా అధ్యక్షుడు కాటసాని రాంభూపాల్‌రెడ్డి, ఎమ్మెల్సీ ఇసాక్ బాషా, మాజీ ఎమ్మెల్యేలు శిల్పా రవి, గంగుల బిజేంద్రారెడ్డి, పార్టీ నేతలు

వైఎస్సార్‌సీపీ 'అన్నదాత పోరు'లో గర్జించిన రైతులు

- నిరసనలతో దద్దరిల్లిన నంద్యాల, ఆత్మకూరు, డోన్
- కూటమి ప్రభుత్వంపై వైఎస్సార్‌సీపీ నేతల ఆగ్రహం
- యూరియా ఇంకెప్పుడు ఇస్తారంటూ మండిపాటు
- రైతులను విస్మరిస్తే అధోగతిని రైతుల శాపనార్థాలు

నిరసన ఎక్కుపెట్టి పోరుబాట పట్టి !

కష్టాల్లో ఉన్న రైతులకు ధైర్యాన్నిస్తూ.. మొద్దు నిద్రలో ఉన్న కూటమి ప్రభుత్వాన్ని మేల్కొలిపేలా వైఎస్సార్‌సీపీ చేపట్టిన అన్నదాత పోరులో రైతులు గర్జించారు. మంగళవారం రెవెన్యూ డివిజన్ కేంద్రాల్లో నిరసనలు మిన్నంటాయి. భారీ ర్యాలీలు నిర్వహించి వైఎస్సార్‌సీపీ నేతలు రైతులతో కలసి అధికారులకు వినతి పత్రాలు అందజేశారు. నంద్యాలలో పార్టీ జిల్లా అధ్యక్షులు కాటసాని రాంభూపాల్‌రెడ్డి, నంద్యాల, ఆళ్లగడ్డ మాజీ ఎమ్మెల్యేలు శిల్పా రవిచంద్రకిషోర్‌రెడ్డి, గంగుల బిజేంద్రనాథ్‌రెడ్డి, మాజీ ఎంపీ పోచా బ్రహ్మానందరెడ్డి, ఎమ్మెల్సీ ఇసాక్‌బాషా తదితరులు రైతులను ఆదుకుకోవాలని ఆర్డీవో విశ్వనాథ్‌కు వినతి పత్రం అందజేశారు. అలాగే డోన్‌లో బనగానపల్లె మాజీ ఎమ్మెల్యే కాటసాని రామిరెడ్డి, జిల్లా పరిషత్ చైర్మన్ ఎర్రబోతుల పాపిరెడ్డి, మీట్ కార్పొరేషన్ మాజీ చైర్మన్ శ్రీరాములు ఆధ్వర్యంలో భారీ ర్యాలీ నిర్వహించారు. పోలీసులు ఆంక్షలు విధించినా అన్నదాతలు బెదరలేదు. ఆంక్షలు దాటుకుని పోరులో పాల్గొన్నారు. నిరసనలో భాగంగా రైతుల డిమాండ్లు నెరవేర్చాలని డోన్ ఆర్‌డీఓ నరసింహులుకు వినతిపత్రం అందించారు. అదే విధంగా ఆత్మకూరులో మాజీ ఎమ్మెల్యే శిల్పా చక్రపాణిరెడ్డి, పార్టీ నందికొట్కూరు ఇన్‌చార్జ్ దారా సుధీర్ ఆధ్వర్యంలో శ్రీశైలం, నందికొట్కూరు నియోజకవర్గాల నుంచి రైతులు, పార్టీ నాయకులు, కార్యకర్తలు ర్యాలీగా వెళ్లి ఆర్‌డీఓ నాగజ్యోతికి వినతి పత్రం అందించారు. అడుగడుగునా రైతులు కూటమి ప్రభుత్వ తీరును ఎండగట్టారు.



డోన్.. ఆర్‌డీఓ నరసింహులుకు వినతి పత్రం అంద జేస్తున్న మాజీ ఎమ్మెల్యే కాటసాని రామిరెడ్డి, జెడ్పీ చైర్మన్ ఎర్రబోతుల పాపిరెడ్డి, పార్టీ నేతలు శ్రీ రాములు తదితరులు



ఆత్మకూరు.. ఆర్‌డీఓ నాగజ్యోతికి వినతి పత్రం అంద జేస్తున్న మాజీ ఎమ్మెల్యే శిల్పా చక్రపాణిరెడ్డి, నందికొట్కూరు ఇన్‌చార్జ్ దారా సుధీర్, పార్టీ నేతలు

అడుగడుగునా ఆంక్షలు



అన్నదాత పోరు విజయవంతం అవుతుందని భయపడిన కూటమి నేతలు పోలీసులతో అడ్డుకోవాలనే ప్రయత్నాన్ని రైతులు తిప్పికొట్టారు. 30 యాక్ట్ అమలు చేసి ర్యాలీలను అడ్డుకోవాలని చూసింది. డోన్‌లో అధిక వాహనాలతో వెళ్లరాదని, బ్యానర్లు, ప్లకార్డులు ప్రదర్శించరాదని పోలీసులు షరతులు విధించారు. కేవలం 20 మందికి మాత్రమే ఆర్డీఓకు వినతి ప్రతం ఇచ్చేందుకు అనుమతి ఇచ్చారు. ప్రభుత్వం అన్నదాత పోరు ఆందోళనను అణిచివేసేందుకు ఎన్ని ఆంక్షలు విధించినా అన్నదాతలు కదలివచ్చారు. డోన్, బనగానపల్లె ప్రాంతాల నుంచి భారీగా రైతులు తరలివచ్చి కూటమి ప్రభుత్వానికి వ్యతిరేకంగా నినాదాలు చేశారు. అయితే ఈ కార్యక్రమాన్ని పోలీసులు డ్రోన్ కెమెరాతో చిత్రీకరించడం గమనార్హం.

టీడీపీ నేతలు యూరియా బొక్కేస్తున్నారు

గ్రామాల్లో టీడీపీ నేతలు చెప్పిన వారికే యూరియా అందుతోంది. ఆళ్లగడ్డ నియోజకవర్గం కొండాపురం గ్రామంలో టీడీపీ నాయకులు చెప్పిన వారికి యూరియా పంపిణీ ఇవ్వలేదని విలేజ్ అగ్రికల్చర్ అసిస్టెంట్‌ను చెట్టుకు కట్టేసి కొట్టారు. రైతు పండించిన మామిడి పంటకు గిట్టుబాటు ధరలేదని వారికి మద్దతు నిలిచేందుకు మాజీ ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి వెళితే రైతులపై కేసులు పెట్టడం ఎంత వరకు సమంజసం. పొగాకు, ఉల్లి, మిర్చి పంటలకు గిట్టుబాటు ధరలు లేక రైతులు రోడ్లపై పారబోస్తున్నా పట్టించుకోరు.

– గంగుల బిజేంద్రనాథ్‌రెడ్డి, మాజీ ఎమ్మెల్యే ఆళ్లగడ్డ

కూటమి నిర్లక్ష్యంతో రైతులకు కష్టాలు ..

కూటమి ప్రభుత్వం నిర్లక్ష్యంతోనే రైతులు కష్టాలు పడుతున్నారు. రాష్ట్రంలో రైతులు పండించినా ఏ పంటకు కూడా గిట్టుబాటు ధరలేకుండా పోయింది. భూమిని నమ్ముకుని ఎంతో ఆశతో జీవిస్తున్న రైతుకు కనీసం ఎరువులు అందించలేని స్థితిలో ఈ ప్రభుత్వం ఉంది. చంద్రబాబు రైతు ద్రోహి. రాష్ట్రంలో ఉన్న రైతులను రెండుగా చీల్చి టీడీపీకి చెందిన రైతులకు ఎరువులు అందించటం సరైంది కాదు. రైతులకు మేలు చేసిన ముఖ్యమంత్రి ఎవరైనా ఉన్నారంటే అది వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి మాత్రమే.

– ఇసాక్‌బాషా, ఎమ్మెల్సీ

మొద్దు నిద్ర ఇంకెన్నాళ్లు

యూరియా కోసం రైతాంగం ఇబ్బందులు పడుతుంటే కూటమి ప్రభుత్వం ఇంకెన్నాళ్లు మొద్దు నిద్రలో ఉంటుందో తెలియడం లేదు. ఎరువుల కోసం రైతులు రోడ్డెక్కుతున్నా సీఎం చంద్రబాబు, వ్యవసాయ శాఖమంత్రి అచ్చెన్నాయుడికి చీమ కుట్టినట్లయినా లేదు. కూటమి నేతలు ఎరువులు దారి మళ్లించి అమ్ముకుంటున్నా అడిగేవారు లేరు. యూరియా బస్తా ఎమ్మార్పీ రూ. 270 ఉంటే రైతులు రూ. 600తో బ్లాక్‌లో కొనాల్సిన దుస్థితి దాపురించింది. గత వైఎస్సార్‌సీపీ ప్రభుత్వ హయాంలో రూ. 7.802 కోట్లతో ఏర్పాటు చేసిన ధరల స్థిరీకరణ నిధికి కూటమి ప్రభుత్వం మంగళం పాడింది. రైతులకు సున్నా వడ్డీ రుణాలకు చంద్రబాబు ఎగనామం పెట్టారు.

– కాటసాని రామిరెడ్డి, బనగానపల్లి మాజీ ఎమ్మెల్యే

రైతుల కష్టాలు కనిపించవా

కూటమి ప్రభుత్వానికి రైతుల కష్టాలు కనిపించవు. పది ఎకరాల్లో పంటలు సాగు చేసే రైతుకు రెండు, మూడు బస్తాలు యూరియా పంటలకు ఎలా వేసిది. రైతుల సమస్యలపై కూటమి పాలకులకు అవగాహన లేదా? ఓ వైపు యూరియా అందక రోడ్ల పైకి చేరుకుంటున్నా.. మరో వైపు నష్టాలతో ఆత్మహత్యలు చేసుకుంటున్నా.. చంద్రబాబు ప్రభుత్వం కళ్లుండి చూడలేకపోతుంది. మాజీ సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ఆధ్వర్యంలో రైతుల పక్షాన మరిన్ని ఉద్యమాలు చేపడుతాం.

– దారా సుధీర్, వైఎస్సార్‌సీపీ నందికొట్కూరు ఇన్‌చార్జ్



డోన్.. ఆందోళనకు భారీగా తరలివచ్చిన రైతులు, వైఎస్సార్‌సీపీ నేతలు, కార్యకర్తలు



ఆత్మకూరు.. అన్నదాత పోరు ర్యాలీకి భారీగా తరలివచ్చిన రైతులు

ఉల్లి కొనుగోళ్లు అంతంతే!

మార్కెట్‌కు 14,325 క్వింటాళ్లు

- వ్యాపారులు కొనింది 6,749 క్వింటాళ్లు మాత్రమే

కర్నూలు(అగ్రికల్చర్): కర్నూలు వ్యవసాయ మార్కెట్ యార్డులో ఉల్లి అమ్మకాల కోసం రైతులు వ్యాపారులు లేదా మార్క్‌ఫెడ్ అధికారుల కోసం ఎదురు చూసే పరిస్థితి ఏర్పడింది. మంగళవారం మార్కెట్ యార్డుకు 14,325 క్వింటాళ్ల ఉల్లి వచ్చింది. రెండు విడతలుగా వ్యాపారులతో ఈ–నామ్‌లో టెండర్లు వేయించినప్పటికీ 6,749 క్వింటాళ్లు మాత్రమే కొనుగోలు చేశారు. క్వింటాకు కనిష్ఠంగా రూ200, గరిష్ఠంగా రూ.1139 ధర పలికింది. రూ.1000 పైన ధర కేవలం నాలుగైదు లాట్లకు మాత్రమే లభించగా.. మిగిలిన లాట్లకు రూ.600–రూ.700 మాత్రమే ధర లభించింది. రైతులు తెచ్చిన ఉల్లిలో 7,576 క్వింటాళ్ల ఉల్లి మార్కెట్‌లోనే ఉండిపోవడం గమనార్హం. ఈ సరుకు మార్క్‌ఫెడ్ కొంటుందా లేదా అనే విషయమై సాయంత్రం 7 గంటల వరకు స్పష్టత కరువైంది. ఈ నేపథ్యంలో జిల్లా కలెక్టర్ రంజిత్‌బాషా, జేసీ నవ్య, ఎస్పీ విక్రాంత్‌పాటిల్ సాయంత్రం మార్కెట్ యార్డుకు చేరుకున్నారు. ఉల్లిగడ్డల నాణ్యతను పరిశీలించారు. ఎట్టకేలకు మిగిలిపోయిన ఉల్లిగడ్డలను కొనుగోలు చేయాలని మార్క్‌ఫెడ్‌కు ఆదేశాలు ఇచ్చారు. కలెక్టర్ వెంట మార్కెటింగ్ శాఖ జేడీ రామాంజనేయులు, డీడీ లావణ్య, ఏడీఎం నారాయణమూర్తి, సెక్రటరీ జయలక్ష్మి తదితరులు ఉన్నారు. ఇదిలాఉంటే ప్రభుత్వం రూ.1200 మద్దతు ధర ప్రకటించిన నేపథ్యంలో ఉల్లిగడ్డలు రీసైక్లింగ్ జరుగుతున్నాయేమోననే అనుమానాలు వ్యక్తమవుతున్నాయి. దీంతో పరిశీలనకు జిల్లా యంత్రాంగం ఐదుగురు ఉద్యాన అధికారులతో ప్రత్యేక టీమ్ ఏర్పాటు చేసింది. ఇకపోతే బుధవారం మార్కెట్‌లో ఉల్లిగడ్డలను అమ్మకానికి పెట్టేందుకు మంగళవారం సాయంత్రం నుంచి ట్రాక్టర్లు వస్తున్నాయి. అయితే లోపల ఖాళీ లేకపోవడంతో వచ్చిన వాహనాలన్నిటినీ బయటనే నిలిపేయంతో ట్రాఫిక్ స్తంభించింది.



రోడ్డుపై బారులు తీరిన ఉల్లి వాహనాలు

11, 12 తేదీల్లో ఇన్‌స్పైర్ మనక్ శిక్షణ తరగతులు

కర్నూలు సిటీ: జిల్లాలోని అన్ని యాజమాన్యాలకు చెందిన ప్రాథమికోన్నత, ఉన్నత పాఠశాలకు చెందిన సైన్స్ ఉపాధ్యాయులకు ఈ నెల 11, 12 తేదిల్లో ఇన్‌స్పైర్ మనక్ శిక్షణ తరగతులు నిర్వహించనున్నట్లు జిల్లా సైన్స్ కో–ఆర్డినేటర్ రంగమ్మ మంగళవారం ఒక ప్రకటనలో తెలిపారు. కర్నూలు డివిజన్‌కు చెందిన ఉపాధ్యాయులకు 11వ తేదీన సిల్వర్‌జూబ్లీ డిగ్రీ కాలేజీ, 12వ తేదీన ఆదోని డివిజన్‌లోని ఉపాధ్యాయులు శిక్షణకు హాజరుకావాలన్నారు. ఉపాధ్యాయులు తమ వెంట విద్యార్థులకు సంబంధించిన వివరాలను సేకరించి శిక్షణకు హాజరుకావాలన్నారు. ఇన్‌స్పైర్ మనక్ నామినేషన్స్ www.inspireawards-dst.gov.in అనే వెబ్‌సైట్‌లో నమోదు చేయాలన్నారు. పూర్తి వివరాలకు 8790111331 నెంబర్‌ను సంప్రదించాలని ఆమె పేర్కొన్నారు.

క్లుప్తంగా

వివాహిత అదృశ్యం



సోము శశిరేఖ (ఫైల్)

సంజామల: మండల పరిధిలోని కానాల గ్రామానికి చెందిన ఓ వివాహిత అదృశ్యమైంది. సంజామల ఎస్‌ఐ రమణయ్య తెలిపిన వివరాల మేరకు..కానాల గ్రామానికి చెందిన సోము భాస్కర్‌రెడ్డి కుమార్తె సోము శశిరేఖకు నంద్యాలకు చెందిన శ్రీహరి రెడ్డితో 2023 సంవత్సరంలో వివాహమైంది. భార్యాభర్తల వ్యక్తిగత గొడవల కారణంగా సోము శశిరేఖ పెళ్లి అయిన కొన్ని నెలలకే తల్లిదండ్రుల వద్దకు చేరుకుంది. ఆ తర్వాత వారి నుంచి కూడా బయటకు వెళ్లిపోయింది. అయితే, తన భార్య కనిపించడం లేదని శ్రీహరి రెడ్డి మంగళవారం పోలీసులను ఆశ్రయించాడు. మిస్సింగ్ కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్‌ఐ తెలిపారు.

ఆలయ హుండీలు చోరీ



బయట పడేసిన హుండీని పరిశీలిస్తున్న ఎస్‌ఐ

గడివేముల: మండల కేంద్రమైన గడివేములలోని కొత్త మూలపెద్దమ్మ ఆలయంతో పాటు బూజునూరు గ్రామంలోని వెంకటేశ్వరస్వామి హుండీలను సోమవారం అర్ధరాత్రి గుర్తుతెలియని దుండగులు ఎత్తుకెళ్లారు. ఆలయాలకు ఉన్న తాళాలను పగలగొట్టి ఈ ఘాతుకానికి పాల్పడ్డారు. హుండీల్లోని సొమ్మంతా తీసుకుని ఊరి బయట వాటిని పడేసి వెళ్లారు. మంగళవారం ఆలయ నిర్వాహకులు గమనించి పోలీసులకు సమాచారం అందించారు. ఈ చోరీపై దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్‌ఐ నాగార్జునరెడ్డి తెలిపారు. కాగా హుండీల్లో దాదాపు రూ.2 లక్షల దాకా ఉంటుందని నిర్వాహకులు చెబుతున్నారు.

అంగన్‌వాడీ టీచర్‌పై సీడీపీఓ వేధింపులు




ఆలూరు ఆసుపత్రిలో చికిత్స పొందుతున్న అంగన్‌వాడీ టీచర్ భువనేశ్వరి

ఆలూరు రూరల్: ఐసీడీఎస్ సీడీపీఓ వేధింపులు తాళలేక ఓ అంగన్‌వాడీ టీచర్ తీవ్ర అస్వస్థతకు గురై ఆసుపత్రిలో చేరింది. బధితురాలు తెలిపిన వివరాల మేరకు . ఆలూరు మండలం కురువళ్లి గ్రామంలోని అంగన్‌వాడీ సెంటర్‌లో భువనేశ్వరి కార్యకర్తగా విధులు నిర్వహిస్తోంది. ఈ నెల 6వ తేదీన ఆలూరు ఐసీడీఎస్ సీడీపీఓ నరసమ్మ కురువళ్లి అంగన్‌వాడీ కేంద్రానికి తనిఖీకి వెళ్లి స్టాక్ రూం పరిశీలించారు. సరుకుల వివరాలు స్టాక్ రిజిస్టర్‌లో నమోదు చేయకపోవడంతో ఆగ్రహం వ్యక్త చేస్తూ రూ. 4 వేలు డిమాండ్ చేసింది. ఈ మొత్తాన్ని ఫోన్ పే చేయమని సూచించగా అంగన్‌వాడీ కార్యకర్త పంపించలేదు. దీంతో సీడీపీఓ ఆమెను వేధించడం మొదలుపెట్టింది. మంగళవారం ఆలూరులోని ఐసీడీఎస్ కార్యాలయ ఆవరణలో నిర్వహించిన అంగన్‌వాడీల కార్యకర్తల సమావేశంలో భువనేశ్వరిని టార్గెట్ చేసింది. అందరి ముందు సరుకులను అమ్ముకుంటున్నావని ఆరోపిస్తూ దురుసుగా మాట్లాడారు. డబ్బు ఇవ్వలేదని తనపై నింద వేయడంతో అస్వస్థతకు గురై ఆసుపత్రిలో చేరినట్లు బాధితురాలు తెలిపారు. ఒక పక్క పని ఒత్తిడి.. మరో పక్క అధికారుల వేధింపులు తాళలేకపోతున్నామని భువనేశ్వరి వాపోయారు.



కొలిమిగుండ్ల బస్టాండ్‌లో బస్సు కోసం ఎదురుచూస్తున్న ప్రయాణికులు, విద్యార్థులు



ప్రయాణాలు వాయిదా వేసుకోవాలని కోవెలకుంట్ల డిపోలో అతికించిన నోటీస్‌బోర్డు



నంద్యాల ఆర్టీసీ బస్టాండ్‌లో ఒక్క బస్సు కూడా లేని దృశ్యం

ప్రయాణికులకు విజ్ఞప్తి
బస్సులన్నీ సీఎం టూర్‌కు

ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు అనంతపురం జిల్లా పర్యటన ప్రయాణికులకు శాపంగా మారింది. సీఎం పర్యటనకు జిల్లా నుంచి పెద్ద సంఖ్యలో బస్సులు కేటాయించారు. అన్ని రకాల సర్వీసులు కలుపుకొని మొత్తం 410 ఉండగా ఇందులో 280కు పైగా బస్సులు సీఎం టూర్‌కు వేశారు. దీంతో మంగళవారం మధ్యాహ్నం నుంచే వివిధ రూట్లకు ఆర్టీసీ అధికారులు బస్సు సర్వీసులు రద్దు చేయడంతో ప్రయాణికులు తీవ్ర ఇబ్బందులు పడ్డారు. నంద్యాల, ఆళ్లగడ్డ, జమ్మలమడుగు, కర్నూలు, తాడిపత్రి, తదితర ప్రధాన రూట్లకు బస్సుల రాకపోకలు నిలిచిపోయాయి. గ్రామాలకు వెళ్లే పల్లెవెలుగు బస్సులు లేకపోవడంతో మహిళలు , చిన్నపిల్లలు, వృద్ధులు, విద్యార్థులు గంటల తరబడి వేచి ఉన్నారు. చివరకు ఆటోలు, ఇతర ప్రైవేట్ వాహనాలను ఆశ్రయించి గమ్యస్థానాలకు చేరుకోవాల్సి వచ్చింది.ఇదిలా ఉంటే సీఎం పర్యటన సందర్భంగా బుధవారం రాత్రి వరకు వివిధ రూట్లలో బస్సు సర్వీసులు రద్దు చేశామని.. ప్రయాణికులు తమ ప్రయాణాలను వాయిదా వేసుకోవాలని ఏకంగా అధికారులు కోవెలకుంట్ల బస్టాండ్‌లో నోటీస్‌బోర్డు అతికించడం గమనార్హం.

– సాక్షి నెట్‌వర్క్



కోవెలకుంట్ల–అవుకు బస్ ఎక్కేందుకు ఎగబడ్డ ప్రయాణికులు



కోవెలకుంట్ల నుంచి సీఎం పర్యటనకు తరలి వెళ్లేందుకు వేచి ఉన్న బస్సులు



బనగానపల్లె బస్టాండ్‌లో బస్సుల కోసం పడిగాపులు కాస్తున్న ప్రయాణికులు

ఉన్నది ఒకటే జిందగీ!

- ఆత్మహత్యలు వద్దు..బతికి సాధిద్దాం
- ఇటీవల పెరిగిన బలవన్మరణాలు
- ఆత్మీయ స్పర్శతో నివారణకు అవకాశం
- నేడు ప్రపంచ ఆత్మహత్యల నివారణ దినం

➡ వెల్దుర్తి మండలం ఎస్.పేరాముల గ్రామానికి చెందిన ముంత మద్దిలేటి అనే రైతు వ్యవసాయం కోసం చేసిన అప్పులు తీర్చేదారి లేక ఈ నెల 3వ తేదీన ఆత్మయత్యాయత్నం చేసుకోగా ఆసుపత్రిలో కోలుకోలేక ఈనెల 7వ తేదీన మరణించాడు.

➡ పగిడ్యాల మండలం పడమర వనుముల పాడు గ్రామానికి చెందిన బోయ నాయుడు అనే వ్యక్తి ఓ కేసు విషయంలో పోలీసులు మందలించడంతో అవమానంగా భావించి ఈ నెల 3వ తేదీన క్రిమిసంహారక మందు తాగి ఆత్మహత్యాయత్నం చేసుకున్నాడు.

➡ గడివేముల మండలంలోని చిందుకూరు గ్రామానికి చెందిన కమాల్‌సా అనే వృద్ధుడు అనారోగ్యంతో బాధపడుతూ జీవితంపై విరక్తి చెంది ఈ నెల 2న క్రిమిసంహారక మందు తాగి బలవన్మరణానికి పాల్పడ్డాడు.

ఓ కష్టం..ఓ నష్టం..ఆవేదన..ఆవేశం..ఆక్రోశం ఇలా ఏదో ఓ కారణం మనిషిని ప్రాణం తీసుకునేలా చేస్తుంది. ఉన్నది ఒకటే జీవితం. ఏం సాధించినా అందులోనే. అలాంటి జీవితాన్ని అర్ధంతరంగా కాలదన్నుకుంటే? మన కథ అక్కడితో పరిసమాప్తమవుతోంది. ఈ విషయం తెలియక సమాజంలో చాలా మంది తమ ప్రాణాలను స్వయంగా తీసుకుంటున్నారు. కుటుంబ సభ్యులు వారి కదలికలను గమనించి వారి ప్రయత్నాన్ని అడ్డుకుంటే చాలు పోయే ప్రాణాన్ని నిలబెట్టవచ్చు. నేడు 'ప్రపంచ ఆత్మహత్యల నివారణ దినం' సందర్భంగా ప్రత్యేక కథనం.



కర్నూలు(హాస్పిటల్): ఉమ్మడి కర్నూలు జిల్లాలో ఏదో ఒక చోట వ్యక్తులు ఆత్మహత్యలు, ఆత్మహత్యాయత్నాలు చేస్తూనే ఉన్నారు. బలవంతంగా తమ ప్రాణాలను తామే తీసుకుంటున్నారు. కర్నూలు, నంద్యాల జిల్లాల్లో ప్రతి నెలా 30 నుంచి 40 మంది దాకా బలవంతంగా తనువు చాలిస్తున్నారు. ఇందులో పలువురు వివిధ కారణాలతో క్షణికావేశంతో ఆయువు తీసుకుంటున్నారు. మిగిలిన వారు ఆరోగ్య సమస్యలు, డిప్రెషన్, మానసిక సమస్యలు, ఆర్థిక కారణాలు, కుటుంబ సమస్యలు ఉంటున్నాయి. ఇలాంటి వారికి సమయానికి చెప్పే వారు లేకపోవడమే కారణం. ఉమ్మడి కుటుంబాలు తగ్గిపోవడం, చిన్నకుటుంబాలు ఏర్పడటం, వారికి ఏ చిన్న సమస్య వచ్చినా సర్ది చెప్పేవారు లేకపోవడం, భార్యాభర్తలు ఇద్దరూ ఉద్యోగాలు చేయడం, పిల్లలకు మంచి విషయాలు చెప్పేవారు లేకపోవడం , సోషల్ మీడియా, సినిమాలు, టీవీ సీరియళ్ల మొదలైన అంశాలు ఆత్మహత్యలు పెరిగేందుకు కారణమవుతున్నాయని వైద్యులు చెబుతున్నారు. ఆత్మహత్యతో మరణించే వారిలో ఎక్కువ మంది మానసిక ఆరోగ్య సమస్యలైన డిప్రెషన్, మత్తు–మద్యం వినియోగ రుగ్మత ఉన్న వారు, సైకోసిస్, పర్సనాలిటీ డిసార్డర్స్ ఉన్నవారు ఉన్నారు. వీరితో పాటు ఆర్థిక సంక్షోభం, సంబంధాల వైఫల్యాలు, అవమానం, సన్నిహిత కుటుంబ సభ్యుడి మరణం, తీవ్రమైన అనారోగ్యం ఇవన్నీ ఆత్మహత్య దోరణిని పెంచుతున్నాయని వైద్యులు పేర్కొంటున్నారు.

90 శాతం క్షణికావేశంతోనే ఆత్మహత్యలు



ఇటీవల కాలంలో ఆత్మహత్యలు చేసుకునే వారి సంఖ్య గణనీయంగా పెరిగింది. ఇందులో 90 శాతం క్షణికావేశంతో చేసుకునేవే ఉంటున్నాయి. కారణాలేవైనా ఆత్మహత్య చేసుకోవాలనుకునేవారి పట్ల కొద్దిగా అప్రమత్తంగా ఉంటే చాలు నిరోధించవచ్చు. ప్రభుత్వ ఆసుపత్రికి వచ్చిన వారి మానసిక సమస్యలు తెలుసుకుని, వారిలో ఆత్మహత్యకు సిద్ధమైన వారు ఉంటే అలాంటి వారిని ముందే గుర్తించి కౌన్సెలింగ్ నిర్వహించి అవసరమైన మందులు అందిస్తున్నాము.

–డాక్టర్ ఎస్.నాగేశ్వరరావు, మానసిక వైద్యవిభాగాధిపతి, జీజీహెచ్, కర్నూలు

టెలిమానస్ 14416కు కాల్ చేయాలి



చాలావరకు ఆత్మహత్యలు మానసిక ఒత్తిళ్లు, ఆర్థిక, కుటుంబ సమస్యలు, పరీక్షల్లో ఫెయిల్ కావడం, సంక్షోభాలు, జబ్బు నయం కాదనే భయంతోనే జరుగుతుంటాయి. కొందరు సోషల్ మీడియాలో నెగిటివ్ కామెంట్స్ పెట్టినా తట్టుకోలేరు. ఆత్మహత్య ఆలోచన వచ్చిన వారు టెలిమానస్ 14416 అనే టోల్‌ఫ్రీ నెంబర్‌కు ఫోన్ చేస్తే వారు అలాంటి వారికి కౌన్సిలింగ్ చేసి ఆత్మహత్యకు సంబంధించిన ఆలోచనల నుంచి దూరం చేస్తారు.

–డాక్టర్ ఎం. శివశంకర్‌రెడ్డి, మానసిక వైద్యులు, కర్నూలు

పండ్లతోటల అభివృద్ధిపై దృష్టి సారించండి

- సాంకేతిక సహాయకులకు డ్వామా పీడీ ఆదేశం



సమావేశంలో మాట్లాడుతున్న డ్వామా పీడీ వెంకటరమణయ్య

కర్నూలు(అగ్రికల్చర్): జిల్లాలో పండ్లతోటల తోటల అభివృద్ధిపై ప్రత్యేక దృష్టి సారించాలని జిల్లా నీటి యాజమాన్య సంస్థ ప్రాజెక్టు డైరెక్టర్ వెంకటరమణయ్య జాతీయ ఉపాధి హామీ పథకానికి చెందిన సాంకేతిక సహాయకులను ఆదేశించారు. మంగళవారం కలెక్టరేట్‌లోని డ్వామా సమావేశ మందిరంలో పత్తికొండ, ఆదోని, ఆలూరు క్లస్టర్ల పరిధిలోని సాంకేతిక సహాయ సహాయకులతో ఏర్పాటు చేసిన సమావేశంలో పీడీ మండలాల వారీగా పండ్లతోటల టార్గెట్ ఎంత.. ఇప్పటి వరకు సాధించిన ప్రగతి తదితర వాటిపై సమీక్షించారు. వివిధ మండలాల్లో పురోగతి తక్కువగా ఉండటంతో సంబంధిత టీఏలపై అసంతృప్తి వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ...ఈ ఏడాది 4500 ఎకరాల్లో ఉపాధి నిధులతో వందశాతం సబ్సిడీతో పండ్లతోటలు అభివృద్ధి చేయాలనేది లక్ష్యమని, ఇప్పటి వరకు 4220 ఎకరాలకు జిల్లా కలెక్టర్ పరిపాలన అనుమతులు ఇచ్చారని తెలిపారు. ఈ నెల చివరిలోపు లక్ష్యం మేరకు ప్లాంటేషన్ పూర్తి చేయాలని ఆదేశించారు. అలాగే ఫాంపాండ్స్ తవ్వకాలపై ప్రత్యేక దృష్టి సారించాలని తెలిపారు. సమావేశంలో ఏపీడీలు లక్ష్మన్న, క్రిష్ణమోహన్, ప్లాంటేషన్ మేనేజర్ నందకిశోర్ తదితరులు పాల్గొన్నారు.

కష్టమంతా జీవాలకు మేత!



గోనెగండ్లలో ఉల్లి పంటను గొర్రెలు మేస్తున్న దృశ్యం

గోనెగండ్ల: ఆరుగాలం కష్టపడి పండించిన ఉల్లి పంటకు ధర లేకపోవడంతో రైతులు తల్లడిల్లిపోతున్నారు. వేలాది రూపాయలు పెట్టుబడి పెట్టి నష్టాలు మూటగట్టుకుంటున్నారు. ఈ క్రమంలో కొందరు రైతులు చేతికి వచ్చిన పంటను పొలాల్లోనే వదులుతున్నారు. మండల కేంద్రం గోనెగండ్లకు చెందిన చాకలి బ్రహ్మయ్య అనే రైతు ఎన్నో ఆశలతో 2.50 ఎకరాల్లో ఉల్లి సాగుచేశాడు. రూ.1.50 లక్షలు పెట్టుబడి పెట్టాడు. పంట చేతికి వచ్చేసరికి క్వింటం ధర రూ.500 నుంచి రూ.600 పలుకుతుంది. ఈ ధరకు కూలీల ఖర్చు కూడా రాదని భావించి పంట కోయకుండా మంగళవారం గొర్రెలకు మేతగా వదిలాడు. తమ పరిస్థితి ఇంత దారుణంగా ఉన్నా పాలకులు పట్టించుకోవడం లేదని వాపోయారు.

పేదల ప్రయోజనాలే లక్ష్యంగా పనిచేయాలి



సమావేశంలో మాట్లాడుతున్న న్యాయమూర్తి లీలా వెంకటశేషాద్రి

కర్నూలు: ప్రభుత్వ సంక్షేమ పథకాలు అర్హత ఉన్న పేదవారికి చేరవేసి ప్రయోజనం కల్పించే దిశగా ఎన్‌జీఓలు (స్వచ్ఛంద సంఘాలు) పనిచేయాలని జిల్లా న్యాయ సేవాధికార సంస్థ కార్యదర్శి బి.లీలా వెంకటశేషాద్రి సూచించారు. జిల్లా ప్రధాన న్యాయమూర్తి కబర్ధి ఆదేశాల మేరకు మంగళవారం కర్నూలు న్యాయ సేవా సదన్‌లో ఉమ్మడి జిల్లా ఎన్‌జీఓలకు సెన్సిటైజేషన్ ప్రోగ్రాం నిర్వహించారు. ఎడ్యుకేషన్, చైల్డ్ వెల్ఫేర్, డిజబిలిటీ, పోలీసు శాఖలకు సంబంధించిన అధికారులు కార్యక్రమంలో పాల్గొన్నారు. మహిళలు, చిన్నపిల్లలు, సీనియర్ సిటిజన్లు, అక్రమ రవాణా బాధితులు, ట్రాన్స్‌జెండర్స్, గిరిజనులు, అసంఘటిత కార్మికుల ప్రయోజనాల కోసం పనిచేసే ఎన్‌జీఓలతో పాటు అన్ని ప్రభుత్వ శాఖలను ఒకే గొడుగు కిందకు తీసుకురావాలనే ఉద్దేశంతోనే సెన్సిటైజేషన్ ప్రోగ్రాంను ఏర్పాటు చేసినట్లు లీలా వెంకటశేషాద్రి తెలిపారు. పేదలు, ప్రభుత్వ శాఖల మధ్య అనుసంధానకర్తలుగా ఎన్‌జీవోలు ఉండాలని కోరారు. సీనియర్ సిటిజన్ డిపార్ట్‌మెంట్ అడిషనల్ డైరెక్టర్ రయీస్ ఫాతిమా మాట్లాడుతూ తమ శాఖ ద్వారా సీనియర్ సిటిజన్లకు, ట్రాన్స్‌జెండర్లకు అనేక సంక్షేమ పథకాలను అందిస్తున్నామని తెలిపారు. నంద్యాల జిల్లా విద్యాశాఖాధికారి జనార్దన్ మాట్లాడుతూ పేద పిల్లలను గుర్తించి, స్కూళ్లలో చేర్పించి విద్యావంతులుగా తీర్చిదిద్దుతున్నామని తెలిపారు. ఉమ్మడి జిల్లాల మండల విద్యాశాఖ అధికారులు కర్నూలు చైల్డ్ ప్రొటెక్షన్ ఆఫీసర్ శారదా, స్వచ్ఛంద సంఘాల నిర్వాహకులు సుధారాణి, డాక్టర్ రాయపాటి శ్రీనివాసులు, బచ్చన్ బచావో ఆందోళన్ మౌనిక, నారాయణ, రామాంజినేయులు, విజయ, సుబ్బరాయుడు తదితరులు సదస్సులో పాల్గొన్నారు.

15న హ్యాండ్‌బాల్ ఎంపిక పోటీలు

కర్నూలు (టౌన్): స్టేట్ లెవల్ ఖేలో ఇండియా ఆధ్వర్యంలో ఈ నెల 15న ఉదయం 7 గంటలకు స్థానిక స్పోర్ట్స్ అథారిటీ ఔట్‌డోర్ స్టేడియంలో హ్యాండ్‌బాల్ ఎంపిక పోటీలు నిర్వహించనున్నట్లు సాయి సెంటర్ ఇన్‌చార్జ్ కార్తికేయన్ మంగళవారం ఒక ప్రకటనలో తెలిపారు. 2008 – 2013 మధ్య జన్మించిన క్రీడాకారులు అర్హులని తెలిపారు. గోల్ కీపర్ ఎత్తు, లెఫ్ట్ హ్యాండ్ క్రీడాకారుల ఎత్తు 175 సెంటీమీటర్లు ఉండాలని తెలిపారు. వివరాలకు సెంటర్ ఇన్‌చార్జ్ 87547 29345 సెల్ నంబర్‌ను సంప్రదించవచ్చన్నారు.

సెట్‌ల కౌన్సెలింగ్‌కు షెడ్యూల్ విడుదల

కర్నూలు కల్చరల్: రాష్ట్ర ఉన్నత విద్యా మండలి పలు సెట్‌లకు కౌన్సెలింగ్ షెడ్యూల్ ప్రకటించింది. లాసెట్, పీజీఎల్‌సెట్, ఎడ్‌సెట్, పీఈసెట్, ఏపీ పీజీసెట్‌లలో కన్వీనర్ కోటా సీట్లను భర్తీ చేయనుంది

- లాసెట్/పీజీ ఎల్‌సెట్‌లో భాగంగా ఎల్‌ఎల్‌బీ (మూడేళ్లు, ఐదేళ్లు), ఎల్‌ఎల్‌ఎం (రెండేళ్లు) కోర్సుల్లో విద్యార్థులకు ప్రవేశాలు కల్పించనుంది. ఈనెల 11వ తేదీ వరకు ఆన్‌లైన్ రిజిస్ట్రేషన్లు, 9 నుంచి 12 వరకు ధ్రువపత్రాల పరిశీలన, 12 నుంచి 14 వరకు వెబ్ ఆప్షన్ల ఎంపిక, 15న వెబ్ ఆప్షన్ల మార్పులకు అవకాశం, 17న సీట్ల కేటాయింపు, 18,19 తేదీల్లో సంబంధిత కళాశాలల్లో విద్యార్థులు రిపోర్ట్ చేయాల్సి ఉంది.
- రెండేళ్ల బీఈడీ, బీఈడీ స్పెషల్ కోర్సులకు ఎడ్‌సెట్ ద్వారా సీట్లు కేటాయింపు చేయనున్నారు. ఈనెల 9 నుంచి 12వ తేదీ వరకు ఆన్‌లైన్ రిజిస్ట్రేషన్, 10 నుంచి 13 వరకు ధ్రువపత్రాల పరిశీలన, 13 నుంచి 15 వరకు వెబ్ ఆప్షన్ల ఎంపిక, 16న వెబ్ ఆప్షన్ల మార్పు, 18న సీట్ల కేటాయింపు, 19, 20 తేదీల్లో కళాశాలల్లో రిపోర్ట్ చేయాల్సి ఉంది.
- రెండేళ్ల బీపీఈడీ, డీపీఈడీ కోర్సుల్లో పీఈసెట్ ద్వారా సీట్లను కేటాయించనున్నారు. ఈనెల 10 నుంచి 13 వరకు ఆన్‌లైన్ రిజిస్ట్రేషన్, 11 నుంచి 14 వరకు ధ్రువ పత్రాల పరిశీలన, 14 నుంచి 16 వరకు వెబ్ ఆప్షన్ల ఎంపిక, 17న వెబ్ ఆప్షన్ల మార్పు, 19న సీట్ల కేటాయింపు, 22, 23 తేదీల్లో కళాశాలల్లో రిపోర్ట్ చేయాలి.
- రాష్ట్రంలోని యూనివర్సిటీల్లో రెండేళ్ల పోస్ట్ గ్రాడ్యుయేషన్ (ఎమ్మెస్సీ, ఎంఏ, ఎంకామ్) కోర్సుల్లో ప్రవేశాలకు ఏపీ పీజీసెట్ ద్వారా సీట్లను కేటాయించనున్నారు. ఈనెల 15వ తేదీ వరకు ఆన్‌లైన్ రిజిస్ట్రేషన్, 9 నుంచి 16 వరకు ధ్రువ పత్రాల పరిశీలన, 12 నుంచి 17 వరకు వెబ్ ఆప్షన్ల ఎంపిక, 18న వెబ్ ఆప్షన్ల మార్పు, 20న సీట్ల కేటాయింపు, 22, 23, 24 తేదీల్లో కళాశాలల్లో రిపోర్ట్ చేయాలని షెడ్యూల్‌లో ప్రకటించారు.

భార్యను హత్య చేసిన భర్త



మృతురాలు శిరీష (ఫైల్)

నంద్యాల: కుటుంబ కలహాలతో భార్యను భర్తే గొంతు కోసి చంపాడు. ఈ దారుణ ఘటన నంద్యాల పట్టణంలో చోటు చేసుకుంది. నంద్యాల టూటౌన్ సీఐ అస్రార్‌బాషా తెలిపిన మేరకు వివరాలు.. సాయినాథ్‌శర్మ, శిరీష దంపతులు పట్టణంలోని ఎన్‌జీఓస్ కాలనీలో నివసిస్తున్నారు. వీరికి ఇద్దరు పిల్లలు. కుమారుడు గత కొన్ని సంవత్సరాల క్రితం రోడ్డు ప్రమాదంలో మృతి చెందగా కూతురు శ్రీహిత స్థానికంగా ఇంటర్ మొదటి సంవత్సరం చదువుతుంది. అయితే, భార్య శిరీష (45) బయట అప్పులు చేయడం..ఈ కారణంతో రుణదాతలు తరచుగా ఇంటికి వస్తున్నారు. దీంతో ఆగ్రహించిన సాయినాథ్‌శర్మ మంగళవారం తెల్లవారుజామున ఇంట్లో కత్తితో భార్య గొంతు కోసి హత్య చేశారు. ఈమేరకు కుమార్తె శ్రీహిత ఫిర్యాదుతో కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నట్లు సీఐ తెలిపారు.

అమ్మానాన్నలు దూరమై..



అనాథలైన చిన్నారులు భరత్, వర్షిణి

ఆస్పరి: తండ్రి హత్యకు గురయ్యాడు..తల్లి జైలుకెళ్లింది. అభం శుభం తెలియని పిల్లలు అనాథలుగా మిగిలారు. ఇంటికి వచ్చిపోయే వారిని ఆ పిల్లలు తదేకంగా చూస్తూ ఉన్నారు. మండలంలోని తొగలుగల్లు గ్రామంలో చోటు చేసుకున్న ఈ హృదయ విదారక దృశ్యం అందరినీ కలచివేస్తోంది. ఈనెల 3వ తేదీన తొగలుగల్లు గ్రామానికి చెందిన అహోబిలం (33) అనే వ్యక్తిని తోడుగా ఉండాల్సిన భార్యే తన ప్రియుడితో కలిసి హత్య చేసిన విషయం తెలిసిందే. అయితే, మృతుడికి 7ఏళ్ల కుమారుడు భరత్ గ్రామంలోనే ప్రాథమిక పాఠశాలలో 3వ తరగతి చదువుతున్నాడు. 5 ఏళ్ల వర్షిణి అనే కుమార్తె అంగన్‌వాడీ కేంద్రంలో చదువుతుంది. తండ్రిని హత్య చేసిన కేసులో తల్లి గంగావతి జైలుకెళ్లింది. కన్నతల్లిదండ్రులు దూరమై దిక్కులు చూస్తున్న పిల్లల భవిష్యతును తలుచుకొని నాయనమ్మ హనుమంతమ్మ కన్నీరుమున్నీరుగా విలపిస్తుంది.

ఇసుక దోపిడీని ముఖ్యమంత్రి దృష్టికి తీసుకెళ్తా

ఆదోని అర్బన్: తన నియోజకవర్గంలో జరుగుతున్న ఇసుక దోపిడీని సీఎం చంద్రబాబునాయుడు దృష్టికి తీసుకెళ్తానని ఎమ్మెల్యే పార్థసారథి పేర్కొన్నారు. మంగళవారం నియోజకవర్గంలో ఇసుక తోలే టిప్పర్ల ఓనర్లు ఎమ్మెల్యేను కలిశారు. ఈ సందర్భంగా ఆయన వారితో మాట్లాడుతూ జిల్లాలో జరుగుతున్న ఇసుక దోపిడీని ఆపాలని ఇదివరకే సబ్‌కలెక్టర్, కలెక్టర్ దృష్టికి తీసుకెళ్లి ఫిర్యాదు చేశానన్నారు.

పనిమనిషే హంతకురాలు

- శివలీల హత్య కేసును ఛేదించిన పోలీసులు
- సీసీ ఫుటేజీ ఆధారంగా గుర్తింపు
- వివరాలు వెల్లడించిన ఎస్పీ



విలేకరుల సమావేశంలో వివరాలు వెల్లడిస్తున్న ఎస్పీ విక్రాంత్ పాటిల్

కర్నూలు : వృద్ధురాలు కాటసాని శివలీలను దారుణంగా హత్య చేసి ఒంటిపై ఉన్న సొత్తులను తస్కరించిన నిందితురాలిని సీసీ కెమెరాలు పట్టించాయి. గణేష్ నగర్ పక్కనున్న (కల్లూరు అర్బన్ 19వ వార్డు) సాయి వైభవ నగర్‌లో నివాసముంటున్న శివలీల (75) ఈనెల 1వ తేదీన దారుణ హత్యకు గురయ్యారు. మూడో పట్టణ పోలీసులు ఈ కేసును ప్రతిష్టాత్మకంగా తీసుకుని వారం రోజుల వ్యవధిలోనే ఛేదించారు. ఇంట్లో ఒంటరిగా ఉన్న శివలీలపై గుర్తు తెలియని వ్యక్తులు దాడి చేసి ఆమె ఒంటిపై ఉన్న బంగారు నగలను తస్కరించి పరారయ్యారు. ఈ మేరకు అల్లుడు చంద్రశేఖర్‌రెడ్డి ఫిర్యాదుతో పోలీసులు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేపట్టగా శివలీల ఇంట్లో పనిమనిషిగా ఉన్న కురువ వరలక్ష్మి ఈ ఘాతుకానికి పాల్పడినట్లు సీసీ కెమెరాల ఫుటేజీ ద్వారా గుర్తించారు. కల్లూరు మండలం చెట్లమల్లాపురం గ్రామంలో ఆమె అక్క ఇంట్లో తలదాచుకుని ఉన్నట్లు ఫోన్‌కాల్ డేటా ఆధారంగా నిర్ధారించుకుని అక్కడికి వెళ్లి ఆమెను అదుపులోకి తీసుకుని ఎస్పీ విక్రాంత్ పాటిల్ ఎదుట హాజరుపరిచారు. కర్నూలు డీఎస్పీ బాబు ప్రసాద్, సీఐలు శేషయ్య, చంద్రబాబు నాయుడు, ఉలిందకొండ ఎస్‌ఐ ధనుంజయతో కలసి మంగళవారం జిల్లా పోలీసు కార్యాలయంలోని వ్యాస్ ఆడిటోరియంలో విలేకరుల సమావేశం నిర్వహించి ఎస్పీ వివరాలు వెల్లడించారు.

హత్య చేసి తాపీగా గోడ దూకి...

ప్యాపిలి మండలం గోపాల నగరం (గోపాల పురం) గ్రామానికి చెందిన వరలక్ష్మి ఉపాధి నిమిత్తం వలస వచ్చి కర్నూలులో నివాసముంటున్నారు. రెండు నెలల క్రితం కాటసాని శివలీల ఇంట్లో పని మనిషిగా చేరింది. హత్యకు రెండు రోజుల ముందు పని మానేసింది. ఒంటరిగా ఉన్న సమయంలో ఇంట్లోకి చొరబడి ఆమె ఒంటిపై ఉన్న నగలు దోచుకెళ్లి స్థిరపడాలని పథకం పన్నింది. ఇందులో భాగంగా ఈనెల 1వ తేదీన స్వగ్రామం గోపాలపురంలో వరలక్ష్మి వితంతు పెన్షన్ తీసుకుని అక్కడి నుంచి డోన్ మీదుగా కర్నూలు వచ్చి గుత్తి పెట్రోల్ బంకు దగ్గర బస్సు దిగి అక్కడినుంచి ఆటోలో రైతుబజార్ మీదుగా శివలీల ఇంటి వద్దకు చేరుకుంది. ముఖానికి స్కార్ఫ్(బట్ట) కట్టుకుని శివలీల ఇంట్లోకి ప్రవేశించి మళ్లీ పనికి వస్తానమ్మా.. అంటూ మాటల్లో పెట్టి సమీపంలో ఉన్న రోకలి బండతో తలపై కొట్టింది. దీంతో ఆమె రక్తపు మడుగులో పడిపోగా మెడలో ఉన్న 6 తులాల బంగారు గొలుసు, 5 తులాల గాజులు, బెడ్ రూమ్‌లో ఉన్న రెండు బ్యాగులను తీసుకుని బయటకు వచ్చి ఇంటి వెనుక బాత్‌రూమ్ పక్కనుంచి కాంపౌండ్ వాల్ దూకి పారిపోయింది. పోలీసులు దర్యాప్తులో భాగంగా సీసీ కెమెరాలను జల్లెడ పట్టగా నిందితురాలు పనిమనిషి అయిన కురువ వరలక్ష్మినే అని తేలింది. దీంతో ఆమెను అదుపులోకి తీసుకుని ప్రశ్నించగా బంగారు నగల కోసమే హత్య చేసినట్లు అంగీకరించింది. ఆమె వద్ద నుంచి బంగారు నగలు, 6 చెక్‌బుక్‌లు, 7 బ్యాంకు పాస్ బుక్కులు, నేరానికి ఉపయోగించిన రోకలి బండను స్వాధీనం చేసుకుని సీజ్ చేశారు. నిందితురాలిని కోర్టులో హాజరుపర్చగా న్యాయమూర్తి రిమాండ్‌కు ఆదేశించినట్లు ఎస్పీ విక్రాంత్ పాటిల్ తెలిపారు. కేసును ఛేదించిన దర్యాప్తు అధికారులతో పాటు పోలీసు సిబ్బందిని ఎస్పీ అభినందించి నగదు రివార్డులు అందజేశారు.